వీఎంఆర్డీఏ పార్కును ఛైర్మన్ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-విశాఖ : వీఎంఆర్డీఏ పార్కును ఛైర్మన్ ప్రణవ్ గోపాల్, కమిషనర్ విశ్వనాథన్ బుధవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాకర్స్ తో మాట్లాడుతూ నిర్వహణ పనులను, మరమత్తులను 20 రోజుల్లో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కొన్ని పనులు ఇప్పటికే 90 శాతం పూర్తి చేశామన్నారు. పార్కు నిర్వహణ ఇప్పుడు మెరుగ్గా ఉందని వాకర్స్ కొనియాడారు. ఈ పర్యటనలో ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, డీఎఫ్ఓ సుజాతా శివానీ, కార్యనిర్వాహక ఇంజినీర్లు రామరాజు, దుర్గా ప్రసాద్, పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీ షోర్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో ఇంటరాక్ట్ అయ్యారు.

లక్ష్యాలకు అనుగుణంగా ఎన్టీఆర్ కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు

కలెక్టర్ హరేంధిరప్రసాద్ ఆదేశాలు

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : లక్ష్యాలకు అనుగుణంగా ఎన్టీఆర్ కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు జరగాలని, మెరుగైన ఫలితాలు సాధించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. 2026 మార్చి నాటికి అన్ని ఇళ్లు పూర్తి కావాలని నిర్దేశించారు. రోజువారీ లక్ష్యాలు పెట్టుకొని పని చేయాలని, పురోగతి సాధించాలన్నారు . బుధవారం మధ్యాహ్నం హౌసింగ్, స్పెషల్ ఆఫీసర్లు, ఇతర అధికారులతో కలెక్టరేట్ మీటింగు హాలులో నిర్వహించిన సమావేశంలో పలు అంశాలపై లేఅవుట్ వారీగా సమీక్షించారు. లక్ష్యాలపై దృష్టి సారించాలని, నాణ్యత విషయంలో రాజీ పడకుండా ఇళ్ల నిర్మాణాల పనులు చేయించాలని పేర్కొన్నారు. లక్ష్య సాధనలో విఫలమైన అధికారులు, సిబ్బందికీ మెమోలు జారీ చేయాలని హౌసింగ్ పీడీని ఆదేశించారు. ఎస్సీ, బీసీ వర్గాల వారికి రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు ప్రభుత్వం అందిస్తున్న అదనపు సాయంపై మరింత అవగాహన కల్పించాలని, లబ్ధిదారులను ప్రోత్సహించి నిర్మాణాల్లో ఆశాజనక ఫలితాలు సాధించాలని చెప్పారు.. నిర్మాణాలు పూర్తయిన ఇళ్ల వివరాలను సంబంధిత లబ్ధిదారులు తెలియజేయాలని చెప్పారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పీడీ సత్తిబాబు, ఈఈ శ్రీనివాసరావు, డీఈలు, ఏఈలు, లేఅవుట్ ఇన్చార్జి అధికారులు, ప్రత్యేక అధికారులు, వర్చ్యువల్ గా ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వార్డు ఎమెనిటీస్ సెక్రటరీలు పాల్గొన్నారు.

సౌత్ కొరియా ఏషియన్ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్ సిల్వర్ విజేతగా శివకోటి క్షేత్ర

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం : సౌత్ కొరియాలో ఈనెల 21వ తేదీ నుంచి జరుగుతున్న 20వ ఏషియన్ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్షిప్ 2025 పోటీల్లో విశాఖ క్రీడాకారిని సిల్వర్ మెడల్ సాధించారు. నగరానికి చెందిన శివకోటి క్షేత్ర డి.దినేష్ కలిసి ఫెయిర్ స్కేటింగ్ పోటీల్లో పాల్గొన్నారు. సిల్వర్ మెడల్ సాధించారు. శివకోటి క్షేత్ర గతంలో చైనాలో జరిగిన 19వ ఏషియన్ రోలర్ స్కేటింగ్ పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించారు. తాజాగా సిల్వర్ మెడల్ సాధించిన సందర్భంగా పలువురు ఆమెను అభినందించారు. శివకోటి క్షేత్ర తండ్రి డాక్టర్ ఎస్ మురళీకృష్ణ విశాఖలో ప్రముఖ హెూమియో వైద్యులు. ఇప్పటివరకు క్షేత్ర 21 జాతీయ మెడల్స్ తో సహా 70 మెడల్స్ సాధించారు. విశాఖలోని లిటిల్ ఏంజెల్స్ స్కూల్లో పదో తరగతి చదువుతున్న క్షేత్ర గత కొంతకాలంగా శివాజీ పార్క్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ కోచ్ పి సత్యనారాయణ కే చిట్టిబాబుల పర్యవేక్షణలో స్కేటింగ్ శిక్షణ పొందుతున్నారు.

టియు 142 మ్యూజియం వద్ద నీటి శుద్ధి ప్లాంట్ ప్రారంభం

విశాలాంధ్ర-విశాఖ : బీచ్ రోడ్డులోని టీ యు 142 మ్యూజియం వద్ద తాగునీటి సరఫరా సదుపాయాన్ని వీఎంఆర్డీఏ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్ ప్రారంభించారు. దివిస సంస్థ సి ఎస్ ఆర్ నిధుల కింద దీనికి 30 లక్షలు సమకూర్చింది. ఈ సందర్భంగా ఛైర్మన్ ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ విశాఖకు వచ్చే సందర్శకులు ప్రముఖంగా సందర్శించే పర్యాటక స్థలాల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు, వీఎంఆర్డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ కె విశ్వనాథన్, జాయింట్ కమీషనర్ రమేష్, ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, కార్య నిర్వాహక ఇంజినీర్లు రామరాజు, దుర్గా ప్రసాద్, దివిస్ ప్రతినిధులు కోటేశ్వర రావు, సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 31 నాటికి 50 శాతం ఆస్తి పన్ను వసూలే లక్ష్యం

జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : ఆగస్టు 31వ తేదీ నాటికి 50 శాతం ఆస్తి పన్ను వసూలే లక్ష్యంగా రెవిన్యూ అధికారులు పనిచేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జీవీఎంసీ ప్రధాన కార్యాలయం లోని సమావేశ మందిరంలో పాల్గొన్న అదనపు కమిషనర్ డి.వి. రమణమూర్తి, డిసిఆర్ ఎస్. శ్రీనివాసరావు, అన్ని జోన్ ల రెవెన్యూ ఆఫీసర్లు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ల తో పాటు వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న వార్డు సచివాలయం అడ్మిన్ కార్యదర్శులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గత సమీక్షలో నిర్దేశించిన ఆస్తి పన్నుల వసూళ్ల యొక్క టార్గెట్ ను ఎంతవరకు పూర్తి చేశారని ఆరా తీశారు. విశాఖ నగర అభివృద్ధి దిశగా జీవీఎంసీ పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్న నేపథ్యంలో జీవీఎంసీ ఆర్థిక పరిపుష్టిని మెరుగుపరుచుకోవల్సిన అవసరం ఉందన్నారు. ఆ దిశగా ఆగస్టు 31వ తేదీ నాటికి 50 శాతం ఆస్తి పన్ను వసూళ్లే లక్ష్యంగా రెవెన్యూ అధికారులు, వార్డు సచివాలయం అడ్మిన్ కార్యదర్శులు పనిచేయాలని ఆదేశించారు. గత వారంతో పోల్చుకుంటే కొన్ని జోన్లలో రెవిన్యూ శాతం పెరిగినప్పటికీ మరికొన్ని జోనల్లో మందకొడిగా వసూలు చేస్తున్నారని తెలిపారు. ప్రతి రెవిన్యూ ఆఫీసర్లు వారి పరిధిలోని డిమాండ్లకు తగిన విధంగా ఆస్తి పన్ను వసూళ్లను పెంచాలన్నారు. జీవీఎంసీ ఆదాయ పరిపుష్టికి రెవిన్యూ అధికారులు నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా వార్డు సచివాలయ అడ్మిన్ కార్యదర్శులకు డోర్ టు డోర్ సర్వే నిర్వహించి కొత్త, పాత బిల్డింగ్ యొక్క కొలతలు సరి చూడాలని దానితో పాటే తాగునీటి కనెక్షన్ ఉంటే వారి ఆస్తి పన్నుతోపాటు నీటి పన్ను చార్జీలు చెల్లిస్తున్నది లేనిది పరిశీలించాలని, ఈ ప్రక్రియ ఆగస్టు 5వ తేదీ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఆస్తి పన్ను మొండి బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించి వాటి వసూళ్లకు చర్యలు తీసుకోవాలని, కేంద్ర ప్రభుత్వ సంస్థల ఆస్తిపన్ను యొక్క బకాయిల పై ప్రత్యేక దృష్టి సారించి రూల్ బుక్ ప్రకారం వసూలు చేసేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కోర్టు కేసులు యొక్క స్టేటస్కో ను స్టడీ చేసి కౌంటర్ ఫైల్ దాఖల చేయాలని అవసరమైతే హైకోర్టుకు వెళ్లాలని ఆదేశించారు. కోర్టులో కేసు ఉందని ఆస్తిపన్ను వసూళ్లకు వెనకాడొద్దని, కోర్టు కేసు యొక్క పూర్వ ఫలాల తోపాటు కోర్టు ఆర్డర్ లను క్షుణ్ణంగా పరిశీలించాలని తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఆస్తి పన్ను వసూలు కేంద్రాలను పెంచేందుకు ప్రతి వార్డులో ప్రజలకు అందుబాటులో ఉన్న ఒక సచివాలయాన్ని ఎంపిక చేసుకొని అక్కడ అవసరమయ్యే మౌలిక వసతులు కల్పించాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఆస్తి పన్నుల వసూలు జీవీఎంసీ కమిషనర్ అకౌంట్ పేరున వచ్చేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని, ప్రస్తుతం ఉన్న బిల్ డెస్క్ ను ప్రమోట్ చేసి అందులో నేరుగా జీవీఎంసీ కమిషనర్ ఎకౌంట్లో ఆస్తిపన్ను జీరో సర్వీస్ చార్జీల తో పన్నులు వసూల్ అయ్యేటట్లు అన్ని చర్యలు చేపట్టాలని జీవీఎంసీ ఐటీ విభాగపు అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ పరిధిలో ఉన్న వార్డ్ సచివాలయాలలో కంప్యూటర్లు మరమ్మత్తులకు గురైనందున వాటి మరమ్మత్తులు చేపట్టేందుకు, అవసరమగు స్టేషనరీ కొనుగోలు చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి, ఐటీ విభాగపు కార్యనిర్వాహక ఇంజనీరు యు.ఎన్.నర్సింగరావును కమిషనర్ ఆదేశించారు. అనంతరం ఈ సమీక్షలో అదనపు కమిషనర్ డి.వి. రమణమూర్తి , డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ ఎస్. శ్రీనివాసరావు మాట్లాడుతూ జీవీఎంసీ ఆర్థిక పరిపుష్టి మెరుగుకు రెవెన్యూ యంత్రాంగం కృషి చేయాలని, ఆ దిశగా నిర్దేశించిన ఆస్తిపన్ను వసూళ్ల టార్గెట్ ను పూర్తి చేసేందుకు రెవెన్యూ అధికారులు, ఇన్స్పెక్టర్లు, వార్డ్ అడ్మిన్ కార్యదర్శులు చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని సూచించారు.

వైసీపీ నయవంచనకు నిలువెత్తు సాక్ష్యం

- టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి నజీర్

విశాలాంధ్ర-విశాఖ సిటీ : వైసిపి నయవంచనకు నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తుందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం డి నజీర్ విమర్శించారు. బుధవారం జిల్లా టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆచరణ కానీ హామీలతో ఐదేళ్లు ప్రజలను మోసం చేశారన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, మళ్ళీ వైసిపి పేరు ఎత్త డానికి భయపడుతున్నారన్నారు. అన్నా క్యాంటీన్లు మూయించారు. పెన్షన్ పెంచడానికి నాలుగేళ్ళు పట్టిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, వివిధ వర్గాల కార్పొరేషన్లు పెట్టి నిధులు విడుదల చేయక మోసం చేశారన్నారు. అమ్మవడి ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి ఇస్తామని చెప్పి ఇచ్చారా అని ప్రశ్నించారు. నాసిరకం మందు విక్రయించి కొన్ని వేల కుటుంబాలు వీదిన పడేలా చేశారని మండిపడ్డారు. కొన్ని లక్షల మంది కిడ్నీ వ్యాధులకు గురై మంచాన పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం కుంభకోణంలో రూ. 3500 కోట్లు దోచుకున్నారని, ఈ కుంభకోణం లో 11 కోట్ల హవాలా డబ్బు నిన్న బయట పడిందని పేర్కొన్నారు. లోకల్ లో వైసీపీ నాయకులు మైక్ లు , టివి లు ఉన్నాయని బాబు పై ఇష్టం వచ్చినట్ల మాటాడుతున్నారు త్వరలో వాళ్లకు ఉంటుందని హెచ్చరించారు. గతం లో మీరు చేసిన పాపాలు మా పార్టీ మర్చిపోలేదు తగిన గుణపాఠం చెపుతామన్నారు. ఒక చిన్న నాయకుని దగ్గరే పదకొండు కోట్లు దొరికాయి అంటే.. మరి పెద్ద పెద్ద నాయకులు ఎన్ని వేల కోట్లు వెనకేసుకున్నారో అని సందేహం వెలిబుచ్చారు. మాలో అవినీతి, తప్పులు చేసిన నాయకులు ఉంటే చూపించండి... వారిపై చర్యలు తీసుకోకుంటే అప్పుడు ప్రశ్నించండని సవాల్ చేశారు.

గర్భిణీలకు ప్రోటీన్ పౌడర్, ఐరన్ టానిక్ అందజేత

రోటరీ నిర్వహణలో ప్రతినెల 9న ఇదే కేంద్రంలో పంపిణీ

విశాలాంధ్ర-అగనంపూడి : గాజువాక రోటరీ క్లబ్ విశాఖపట్నం సౌత్ ఆధ్వర్యంలో అగనంపూడి ఏరియా హెల్త్ సెంటర్లో బుధవారం 100 మంది పేద గర్భిణీలకు డా.గోపి కృష్ణ సమక్షంలో ప్రొటీన్ పౌడర్, ఐరన్ టానిక్ పంపిణీ చేశారు. గర్భిణీల ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి ఉద్దేశించబడిన ఈ కార్యక్రమానికి రోటేరియన్ ఆర్వి రాజశేఖర్ కుటుంబం ఆర్థిక సహాయం అందించింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ వి.శివ కుమార్రెడ్డి మాట్లాడుతూ, ఈ పంపిణీ కార్యక్రమాన్ని ప్రతినెలా 9వ తేదీన ఇదే సెంటర్లో నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు ఉమా మహేశ్వర రెడ్డి, కె. శ్రీనివాస రెడ్డి, అట్లూరి రమేష్, .పి. ప్రభాకర్ రావు, జోగారావు, బోరా కుమార్ రెడ్డి, బి.కొండల రావు తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్ సిబ్బందికి యోగ టీ షర్టుల పంపిణీ

పరిసరాల పరిశుభ్రతపై సిబ్బంది అంకిత భావంతో పనిచేయాలి : స్టాలిన్

విశాలాంధ్ర-గాజువాక : గాజువాక శానిటేషన్ సిబ్బందికి 72వ వార్డు కార్పొరేటర్ ఏ.జె.స్టాలిన్ బుధవారం వార్డు పరిధిలోని చినగంట్యాడ కూడలిలో యోగా టీ షర్టులను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ జీ.వి.ఎం.సి ఆధ్వర్యంలో సమకూర్చిన యోగా టీ షర్టులను శానిటేషన్ సిబ్బందికి పంపిణీ చేయడం జరిగింద న్నారు. పరిసరాల పరిశుభ్రతపై శానిటేషన్ సిబ్బంది అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు రామకృష్ణ, సత్యవేణి, శానిటరీ ఇన్స్పెక్టర్ ఈశ్వర్రావు, సి.ఐ.టి.యూ నాయకులు ఎన్. రాజేంద్రప్రసాద్, సిపిఐ కార్యదర్శి ఆనంద్ పాల్గొన్నారు.

1న విద్యుత్ ఉండని ప్రాంతాలు

విశాలాంధ్ర-తగరపువలస: బి.సింహాచలం నాయుడు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు, సూచనల మేరకు శుక్రవారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు 33/11 కేవీ భీమిలి సబ్ స్టేషన్లోగల 11 కె.వి భీమిలి టౌన్, 11 కె.వి భీమిలి రూరల్ ఫీడర్ లైన్లను తాకుతున్న చెట్ల కొమ్మలను తొలగించుట, ఇతర మరమ్మతుల నిమిత్తము బ్యాంక్ కాలనీ, తాతాజీ నగర్, ఎల్లంపేట, మహాలక్ష్మీపురం, డెక్కటీపాలెం, రజలింగంపేట, రేఖవానిపాలెం, రయపాలెం, మరడపాలెం, ములకుద్దు, భీమిలి టౌన్ ప్రాంతాలలో ప్రాంతాలలో విద్యుత్ నిలుపుదల చేయబడును. వినియోగదారులు అందరూ గమనించవలసిందిగా కోరారు.

పిఎసిఎస్లో రూ.30 లక్షలు రుణాలు రైతులకు అందజేత

విశాలాంధ్ర-ఆనందపురం : మండలంలో ఆనందపురం గ్రామ పంచాయతీలో ఉన్న శ్రీ వెంకటరంగ ప్రాథమిక వ్యవసాయ సహకార బ్యాంక్లో బుధవారం పిఎసిఎస్ చైర్మన్గా పాండ్రంకి అప్పలరాజు బాధ్యతలు స్వీకరించారు. ఆయనతోపాటు డైరెక్టర్గా మీసాల రామునాయుడు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ బ్యాంక్ అభివృద్ధికి కృషి చేస్తానని రైతులకు సహాయ సహకారాలు అందిస్తారని ఈ సందర్భంగా తెలిపారు. రైతులకు 30 లక్షల రుణాలను వారి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఈవో ఎస్ నారాయణరావు, స్టాఫ్ అసిస్టెంట్ జయరాం, పంచముఖి, హేమంత్, సాయి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రజలు రోగాల బారిన పడకుండా పారిశుధ్యాన్ని మెరుగుపరచాలి : జడ్పీ సిఈఓ

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : పంచాయతీలలో గ్రామీణ ప్రజలు రోగాల బారిన పడకుండా "మ్యాజిక్ డ్రైన్ల" నిర్మాణం ద్వారా ప్రజలు ఆరోగ్యంగా ఉండగలరని జెడ్ పి సిఈఓ పి.నారాయణమూర్తి తెలియజేశారు. విశాఖపట్నంలోని జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఈరోజు మధ్యాహ్నం 2:00 గంటలకు "పంచాయతీ పురోగతి సూచిక 2.0" పై వర్క్షాప్ నిర్వహించబడింది. ఈ వర్క్ షాప్ను జిల్లా ప్రజా పరిషత్, ముఖ్య కార్యనిర్వాహణాధికారి పి.నారాయణమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగుపరచడం యొక్క ప్రాముఖ్యతను ఆయన వివరించారు. తదుపరి పై పంచాయతీ పురోగతి సూచిక 2.0 పై మాట్లాడుతూ, పల్లె స్థాయిలో పారదర్శకత, సమర్థవంతత కోసం ఈ సూచిక దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. పంచాయతీలు తమ పనితీరును ఆధునిక పద్ధతుల ద్వారా మెరుగుపరచుకోవడంలో ఈ సూచిక మార్గదర్శకంగా నిలుస్తుందని అన్నారు. డ్వామా విశాఖపట్నం ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆర్. పూర్ణిమా దేవి మాట్లాడుతూ, గ్రామీణ మురుగునీటి సమస్యకు మ్యాజిక్ డ్రైన్లతో సమర్థవంతంగా పరిష్కారం చూపవచ్చని స్పష్టం చేశారు. ఉప ముఖ్య కార్యనిర్వాహణాధికారి కె. రాజ్ కుమార్ మాట్లాడుతూ, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు అందరూ "సోక్ పిట్" మరియు "కమ్యూనిటీ సోక్ పిట్" నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. ఇవి భూగర్భ జలాలను పెంచడంలో , పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో సహాయపడతాయని ఆయన పేర్కొన్నారు. జిల్లా పంచాయతీ అధికారి యం.వి.ఎ. శ్రీనివాస్ మాట్లాడుతూ, ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బందితో కలిసి సోక్ పిట్ మరియు మ్యాజిక్ పిట్ నిర్మాణానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి విశాఖపట్నం 39 మండలాల మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, సహాయక ప్రాజెక్టు అధికారులు, సహాయక ఇంజనీర్లు, గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్య శాఖ అధికారులు పాల్గొన్నారు. జిల్లా పరిషత్ పరిపాలనాధికారులు మరియు సిబ్బంది కూడా ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు.

రాష్ట్రంలో మహిళల పట్ల కీచకులుగా మారిన కూటమి నేతలు

- మహిళలను మోసం చేసే వారికి అండగా మంత్రులు
- ఎమ్మెల్సీ, వైసీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వరుదు కళ్యాణి

విశాలాంధ్ర-విశాఖ సిటీ : రాష్ట్రంలో మహిళల పట్ల కూటమి నేతలు కీచకులుగా మారి వారి మాన ప్రాణాలను, ఆత్మ గౌరవాన్ని హరిస్తున్నారని ఎమ్మెల్సీ, వైసిపి మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వరుదు కళ్యాణి ఆరోపించారు. బుధవారం పార్టీ నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మచిలీపట్నంలో కొల్లు రవీంద్ర అనుచరుడి కుమారుడు ఒక యువతిని మోసం చేస్తే, సదరు యువతికి న్యాయం చేయకుండా ఆమె జీవితానికి వెలకట్టేందుకు మంత్రి సెటిల్ మెంట్ చేయడం దారుణమని మండిపడ్డారు. తన కుమార్తెకు న్యాయం జరగడం లేదంటూ బాధిత యువతి తల్లి ఆత్మహత్యయత్నం చేసినా కూటమి నేతల మనస్సు కరగడం లేదని ధ్వజమెత్తారు. హెూంమంత్రి అనిత ఒక మహిళ అయి ఉండి, మహిళలపై జరిగే అరాచకాలను పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. మాజీ సీఎం వైయస్ జగన్ను దూషించడానికే ఆమె పరిమిత మయ్యారని ఎద్దేవా చేశారు. డీజీపీ నుంచి కానిస్టేబుల్ వరకు రెడ్బుక్ రాజ్యాంగాన్ని అమలు చేయడానికే పరిమితమయ్యారని విమర్శించారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులు అన్నింటికీ సమాధానం చెప్పాలన్నారు. సమావేశం లో జిల్లా మహిళా విభాగ అధ్యక్షురాలు పేడాడ రమణి కుమారి, కార్పొరేటర్ శశికళ , రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి మళ్ళ దేవి విశాలాక్షి, కార్యదర్శి కొర్ల శిరీష, సంయుక్త కార్యదర్శి బుర్ర విజయలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షురాలు శ్రీదేవి వర్మ, పార్టీ మహిళా సీనియర్ నాయకురాలు బయ్యవరపు రాధ, వరలక్ష్మి, మజ్జి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక ఆవిష్కరణలకు పైథాన్ ప్రోగ్రామింగ్ కీలకం

గీతంలో ప్రారంభమైన ఎఫ్డిపి సదస్సు

విశాలాంధ్ర-మధురవాడ : పారిశ్రామిక అవసరాలకు ఆధునిక ఆవిష్కరణలకు పైథాన్ కీలకమనీ ప్రముఖులు వివరించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజి ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ రంగంలో పైథాన్ ప్రోగ్రామింగ్ ప్రయోజనాలు అనే అంశంపై ఫ్యాకల్టీ డవలప్మెంట్ (ఎఫ్డిపి) కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. ఐఐటి గౌహతి ఎలక్ట్రానిక్స్, ఐసిటి అకాడమి ఆధ్వర్యంలో ప్రముఖ శాస్త్రవేత్తలు , పరిశోధకులు, పరిశ్రమల నిపుణులు ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లుగా పాల్గొన్నారు. ఐఐటి గౌహతి నుంచి ప్రొఫెసర్ ఆర్యభట్ట సాహు, ప్రొఫెసర్ గౌరవ్ త్రివేది, ఐఐటి జబల్పూర్ ప్రొఫెసర్ అతుల్గుప్తా, ఎన్ఐటి పాట్నా ప్రొఫెసర్ డాక్టర్ భాస్కర్ మండల్ పాల్గొని అధ్యాపకులకు దిశానిర్దేశం చేశారు. ఇంజనీరింగ్లో ఆటోమేషన్, కృత్రిమ మేధ, సిగ్నల్ ప్రాసెసింగ్, డేటా ఎనలిటిక్స్లలో పైథాన్ ప్రోగ్రామింగ్ ప్రాధాన్యతను వారు వివరించారు. ఈ ఎఫ్డిపి కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజి డైరక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్ పాల్గొని ప్రసంగిస్తూ డిజిటల్ యుగంలో నూతన ఆవిష్కరణలకు పైథాన్ ప్రోగ్రామింగ్ ప్రయోజనకరంగా నిలుస్తోందని అధ్యాపకులు నిరంతర అధ్యయనం ద్వారా బోధన పరిశోధనలో ఉత్తమ ఫలితాలు అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇసిఇ విభాగం అధిపతి ప్రొఫెసర్ పి.భరణి చంద్ర కుమార్, ఎఫ్డిపి కన్వీనర్లు డాక్టర్ వి.జ్యోతి, డాక్టర్ కరుణకుమారి, డాక్టర్ ఐ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఇంజనీరింగ్ అధ్యాపకులతో పాటు నౌకాదళ అకాడమి బోధన సిబ్బంది హజరయ్యారు.

మోటార్ సైకిల్ దొంగతనం కేసులో నిందితుడికి 14 నెలల జైలు శిక్ష

విశాలాంధ్ర-ఆనందపురం : ఆనందపురం క్రైమ్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన మోటార్ సైకిల్ దొంగతనానికి సంబంధించి నిందితుడైన యెర్నింటి కృష్ణబాబు అలియాస్ గంగడుకు భీమిలి 15వ అదనపు జూనియర్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి స్వాతి భవాని 14 నెలల సాధారణ జైలు శిక్ష విధించారు. అదే కాకుండా రూ.5,000 జరిమానా కూడా విధించగా, అది చెల్లించకపోతే అదనంగా 15 రోజుల జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని కోర్టు ఆదేశించింది. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. పల్లిపేట గ్రామానికి చెందిన పల్లి రామకృష్ణ గిడిజాల ఎలక్ట్రికల్ ఆఫీసులో ఉద్యోగిగా పని చేస్తున్నారు. 2024 సెప్టెంబర్ 13న రాత్రి తన పల్సర్ 150 బైక్ (ఏపీ 31 ఈజే 7114)ను ఆఫీస్ ప్రాంగణంలో పార్క్ చేసి ఉంచగా, నిందితుడు యెర్నింటి కృష్ణబాబు దాన్ని దొంగలించాడు. ఈ విషయమై ఆనందపురం పోలీసులు క్రైం నం: 200/2024 కింద కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్ట్ చేశారు. తదనంతరం విచారణ జరిపి చార్జ్షీట్ను కోర్టులో దాఖలు చేశారు. కోర్టులో విచారణ అనంతరం నిందితుడిపై భారత న్యాయ విధాన సంహిత భారతీయ న్యాయ వ్యవస్థ సెక్షన్లు 303(2), 317(2) కింద నేరాన్ని నిర్ధారించింది. సెక్షన్ 317(2) ప్రకారం కోర్టు శిక్ష ఖరారు చేసింది. ఈ కేసును వేగంగా, సమగ్రంగా దర్యాప్తు చేసి న్యాయ ప్రక్రియ పూర్తిచేసిన ఆనందపురం పోలీసుల కృషిని స్థానిక ప్రజలు ప్రశంసిస్తున్నారు. ఈ మేరకు కేసుకు సంబంధించిన వివరాలను క్రైమ్ ఎస్ఐ ఏ. సత్యరావు వెల్లడించారు.

ఏషియన్ రోలర్ స్కేటింగ్ పోటీల్లో దినేష్ ప్రతిభ

ఆర్టిస్టిక్ స్కేటింగ్లో 2 వెండి పతకాలు

విశాలాంధ్ర-అనందపురం : దక్షిణ కొరియాలో జూలై 29న జరిగిన 20వ ఏషియన్ రోలర్ స్కేటింగ్ చాంపియన్షిప్ పోటీల్లో ఆనందపురం మండలం వెల్లంకి గ్రామానికి చెందిన గొలగాని దినేష్ రెండు విభాగాల్లో వెండి పతకాలు సాధించి భారతదేశానికి ఘనత తీసుకొచ్చాడు. ఆర్టిస్టిక్ స్కేటింగ్ విభాగంలోని ఇండివిజువల్ కేటగిరీలో దినేష్ అద్భుత ప్రతిభ చూపి రెండు పతకాలను తన ఖాతాలో వేసుకున్నాడు. ఇదే పోటీల్లో గత సంవత్సరం చైనాలో జరిగిన 19వ ఏషియన్ రోలర్ స్కేటింగ్ చాంపియన్షిప్ పోటీల్లోనూ దినేష్ వెండి పతకం గెలిచిన విషయం తెలిసిందే. ఇప్పటివరకు దినేష్ దేశ, రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో అనేక విజయాలు సాధించాడు.

జాతీయ స్థాయిలో 6 స్వర్ణ పతకాలు, రాష్ట్ర స్థాయిలో 15 స్వర్ణ పతకాలు, జిల్లా స్థాయిలో 18 స్వర్ణ పతకాలు గెలిచి తన సాధనను చాటుకున్నాడు. తన విజయాల వెనుక తన తల్లిదండ్రుల 10 సంవత్సరాల ప్రోత్సాహం, కృషి, మరియు గురువుల మార్గనిర్దేశం ముఖ్యపాత్ర వహించిందని దినేష్ తెలియజేశారు. భవిష్యత్లో ఒలింపిక్స్లో భారత్కు బంగారు పతకం సాధించడమే తన లక్ష్యమని స్పష్టం చేశాడు. ఈ సందర్భంగా దినేష్ గురువులు ు ఇండియా కోచ్ సత్యం, ఆంధ్రప్రదేశ్ కోచ్ చిట్టిబాబు దినేష్ విజయంపై ఆనందం వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కూడా దినేష్ను అభినందించారు.

ఆగస్టు 2, 3 తేదీల్లో జిల్లా చెస్ పోటీలు

విశాలాంధ్ర-పెందుర్తి : విశాఖ జిల్లా అండర్ 19 ఓపెన్, గర్ల్స్ చెస్ సెలక్షన్స్ ఆగస్ట్ 2న, అండర్ 17 ఓపెన్, గర్ల్స్ చెస్ సెలక్షన్స్ ఆగస్టు 3న సమత డిగ్రీ కాలేజ్ వేదికగా, ఆల్ విశాఖ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదిత్య చెస్ అకాడమీ ఆర్గనైజర్ గా నిర్వహించబడుతుందని ఆల్ విశాఖ జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్. బాబురావు తెలియజేశారు. ఈ పోటీలలో గెలిచి నిలిచిన మొదటి నాలుగు స్థానాల్లో అండర్ 19 ఓపెన్, గర్ల్స్ క్రీడాకారులు ఆగస్ట్ 8, 9 తేదీలలో కర్నూల్ జిల్లాలో జరిగే పోటీలకు విశాఖ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. ఈ పోటీలో గెలిచి నిలిచిన మొదటి రెండు స్థానాల్లో అండర్ 17 ఓపెన్, గర్ల్స్ క్రీడాకారులు ఆగస్ట్ 16, 17 తేదీలలో కాకినాడ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి చాంపియన్షిప్-2025 కి విశాఖ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. మరిన్ని వివరాల కొరకు 9676636661, 9848460137. 9849371760 నెంబర్లలో సంప్రదించాలని డాక్టర్ బాబురావు సూచించారు.

ఆదాని స్మార్ట్ మీటర్లను వెంటనే విరమించుకోవాలి

విశాలాంధ్ర-మల్కాపురం : పారిశ్రామిక క్రాంత పరిధి 63వ వార్డు కాకరలోవ, చింతలలోవ, క్రాంతినగర్ ఏరియాలలో స్మార్ట్ మీటర్లు పెడితే ఊరుకోమని, ఇంటింటికి కరపత్రాలు పంచారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు నశించాలని అలాగే ట్రూ ఆఫ్ చార్జీలు మరియు అదనపు చార్జీలు ప్రజల మీద వేసి ప్రజల మీద గుదిబండగా ఎదురుగా వస్తున్న దాన్ని ఎదుర్కోవాలని మరో బషీరాబాద్ తయారు కావద్దని వామపక్ష పార్టీలు ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. ప్రజలకు ఇంటింటికి వెళ్లి స్మార్ట్ మీటర్లను బద్దలు కొట్టండి అని పిలుపునిచ్చారు రేపు అనగా లక్ష్మివారం సాయంకాలం నాలుగు గంటల 30 నిమిషాలకు మల్కాపురం జంక్షన్ నుండి గాజువాక డిపో వరకు వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరుగుతుంది ఈ కార్యక్రమానికి వామపక్ష పార్టీలు ప్రజా సంఘాలు మహిళా సంఘాలు పాల్గొనవలసిందిగా పిలుపునిచ్చారు సిపిఐ పార్టీ కాంద్రేగుల సత్యాంజనేయ మరియు గుడాల రాంబాబు సిపిఎం పార్టీ పైడ్రాజు మరియు కె పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం : సంతబయలు ప్రాంతంలో ఆదాని స్మార్ట్ మీటర్లను మీ ఇంటికి బిగించకుండా అడ్డుకోండి! సిపిఎం పార్టీ ఇంటింటికి ప్రచారం చేస్తూ కరపత్రాలు పంచుతూ స్టిక్కర్లు అంటిస్తూ ప్రజలకు అవగాహన కల్పించింది. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ భీమిలి జోన్ సహాయ కార్యదర్శి ఎస్ అప్పలనాయుడు మాట్లాడుతూ ఈ ఆదాన్ని స్మార్ట్ మీటర్ల వల్ల ప్రతి ఇంటికి 9600 నుండి 12000 వరకు భారం పడుతుందని! 96 నెలలు మన కరెంట్ బిల్లులో కట్ చేసుకుంటారని! రిమోట్ సిస్టంతో కరెంటు ఆన్ అండ్ ఆఫ్ అవుతుందని! భవిష్యత్తులో కరెంటు రాత్రికొక రేటు పగలు ఒక రేటు ఉంటుందని! కరెంట్ బిల్లు కట్టడం మనకి తలకు మించిన భారం అవుతుందని, ప్రతి ఒక్కరూ ఆదాని మీటర్లను వ్యతిరేకించాలని సిపిఎం పార్టీ పిలుపునిస్తుంది! ఈ కార్యక్రమంలో కే సీతాదేవి నాయకులు పంపాను సూర్యనారాయణ ములపర్తిఅప్పారావు సింగిడి రాము ఎం రవణ పొగరు అప్పారావు చిన్న పద్దు పెద్ద పద్దు! తదితరు ప్రజలు కార్మికులు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE 10TH ADDITIONAL DISTRICT JUDGE CUM (MACT) AT ANAKAPALLE.

MVOP NO 314/2025

between
Nammi Srinu and Others..
....Petitioners.
and
Kaviti Surayya and others
....Respondents.

NOTICE

To,
R2:-Allu Sanyasi Rao. S/o. Somu Naidu, age not known to the Petitioners but Major, D.No.63-5-91, Sriharipuram, Malkapuram, Visakhapatnam. (The owner of the Van bearing registration No.AP 24 TB 8723)

Please take notice in the above MVOP posted to Dt.4-9-2025 at 10:30 A.M. before the Honourable Court in person or through your Advocate failing which the matter will be decided exparte.

B. SRINIVAS.
D.S.R. Rajeswari.
Gorli Rajesh
ADVOCATES, SABBAVARAM.

సమాచార శాఖ ఓపెన్ టాప్ వాహనం బహిరంగ వేలం

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : సమాచార పౌర సంబంధాల శాఖ విశాఖపట్నం కార్యాలయంలోని ఓపెన్ టాప్ వాహనానికి ఆగస్టు 18వ తేదీ ఉదయం 11.00 గంటలకు కార్యాలయ ప్రాంగణంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ప్రాంతీయ సంయుక్త సంచాలకులు వి. మణిరామ్ ఓ ప్రకటనలో తెలిపారు. కాలపరిమితి ముగిసి, నిరుపయోగంగా ఉన్న స్వరాజ్ మజ్దా ఓపెన్ టాప్ ఏపీ 31 టీయు 1495 (2008 మోడల్) వాహనాన్ని యధావిధిగా బహిరంగ వేలం వేసేందుకు నిర్ణయించామని పేర్కొన్నారు. వేలంలో పాల్గొనదలచిన వారు రూ.5,000 ధరావతు సొమ్ము చెల్లించాలని, వేలం దక్కించుకున్న వారు జీఎస్టీతో పాటు మొత్తం నగదు వెంటనే చెల్లించాలని స్పష్టం చేశారు. కార్యాలయ పని వేళల్లో వాహనాన్ని పరిశీలించుకోవచ్చన్నారు. వేలం వేయుటకు, రద్దు పరుచుటకు కార్యాలయ అధికారికి అధికారం ఉందని, వివరాలకు ఫోన్ 9642714155 నంబరును సంప్రదించవచ్చని ప్రాంతీయ సంయుక్త సంచాలకులు వి. మణిరామ్ సూచించారు.

వయో వృద్ధుల సంక్షేమ చట్టంపై అవగాహన

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : తల్లిదండ్రులు, వయో వృద్ధుల సంరక్షణ, సంక్షేమ చట్టం-2007 ఆవశ్యకత, కల్పించే హక్కులపై, టైమ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కాన్సెప్ట్ పై జిల్లా కలెక్టరేట్ మీటింగు హాలులో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు ఈ సదస్సులో భాగస్వామ్యులయ్యారు. సదస్సులో భాగంగా హెరిటేజ్ ఫౌండేషన్ ప్రతినిధులు, టైమ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు చట్టం అమలు, కేసుల పరిష్కారం, వృద్ధులకు అందాల్సిన సహాయంపై, టైమ్ బ్యాంక్ ద్వారా పరస్పర సహకారంపై అధికారులకు అవగాహన కల్పించారు. జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధులు, ట్రాన్స్జెండర్స్ సంక్షేమ శాఖ ఏడీ కె. కవిత, భీమిలి ఆర్డీవో సంగీత్ మాథుర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

భీమిలి భవితా సెంటర్లో పిల్లలకు స్పీచ్ తెరపి కార్యక్రమం

విశాలాంధ్ర-తగరపువలస : బుధవారం భీమిలి భవిత కేంద్రం నందు గౌరవ జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి, అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ సమగ్ర శిక్ష వారి ఆదేశాల మేరకు 25 మంది దివ్యాంగ పిల్లలకు భాష ఉచ్చరణలో అభివృద్ధి సాధించేందుకు గాను శ్రీమతి బాల ఈశ్వరి స్పీచ్ థెరపిస్ట్ హాజరై తల్లిదండ్రులుకు, అలాగే పిల్లలకు ఈ స్పీచ్ తెరపీకి సంబంధించినటువంటి అత్యంత ముఖ్యమైన మెలకువలను తెలియజేసి తగు తర్ఫీదును అందించారు. ఈ కార్యక్రమం ఇకపై వారంలో ఒక రోజు భీమిలి భవిత సెంటర్ లో భీమిలి మండలములో స్పీచ్ తెరపీ అవసరమైనటువంటి పిల్లలందరికి థెరపీ ఇవ్వడం జరుగుతుంది, కావున భీమిలి మండలంలో వున్న స్పీచ్ థెరపీ అవసరంవున్న పిల్లల తల్లిదండ్రులందరూ వినియోగించు కోవలసినదిగా కోరారు, ముఖ్య అతిథి గా భీమిలి ఎం ఈ ఓ డొకర. శ్రీనివాసరావు పాల్గొని తల్లిదండ్రులు ఈ అవకాశంను వినియోగించు కోవలిసినదిగా కోరారు. ఈకార్యక్రమంలో కెజియా కుమారి, పార్వతి, భవిత విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

విశాలాంధ్ర-తగరపువలస : డా.బి.ఆర్. అంబేద్కర్ జి.వి.యం.సి ప్రాథమిక పాఠశాల పాఠశాల యాజమాన్య నిర్వహణ కమిటీ చైర్మన్ దండి వెంకటేష్ ఆధ్వర్యంలో ఇటీవల బదిలీలపై వెళ్లిన ఉపాధ్యాయులు దుర్గాప్రసాద్, లీలామణి, జ్యోతి, వెంకటేశు, ఇందిరలను సత్కరించారు. గత పది సంవత్సరాలుగా పాఠశాలలో చేసిన వారి సేవలను గుర్తించి గౌరవప్రదంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని కమిటీ చైర్మన్ దండి వెంకటేష్ తెలియజేశారు. పాఠశాల అభివృద్ధిలో వారి సేవలు మరువలేనివని ప్రధానోపాధ్యాయురాలు ఎం.పద్మావతి తెలియజేశారు. వార్డ్ అధ్యక్షులు తమ్మిన సూరిబాబు, టీడీపి సీనియర్ నాయకులు కొప్పల కృష్ణ , నరవ రామారావు, బాలకృష్ణ, తమ్మిన శివ, పూర్ణ ఎస్ఎంసి కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కురిమిన రామస్వామినాయుడుకి సత్కారం

విశాలాంధ్ర-ఆనందపురం : ఆనందపురం మండలం పెద్దిపాలెం గ్రామంలో నూతన మార్కెట్ కమిటీ చైర్మన్ కురిమిన రామస్వామి నాయుడుకి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఉప్పాడ గౌరి భర్త బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఉప్పాడ అప్పారావు దంపతులు మరియు బిజేపి విశాఖ జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షులు పి.వి.వి. ప్రసాదరావు పట్నాయక్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ పి.గురు నాయుడు వెల్లంకి సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గౌరి మాట్లాడుతూ ఎన్డీయే కూటమిలో కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ మరియు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, భీమిలి శాసన సభ్యులు గంటా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భీమిలి నియోజకవర్గం లో వ్యవసాయ మార్కెట్ యార్డు అభివృద్ధి పంథాలో అందరూ సహకారంతో నడపాలని కోరుకుంటున్నాం.ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి వి.ప్రసాదరావు రాజగిరి సురేష్ కుమార్,ఎరుసు సూర్ రెడ్డి, వి.బి.నాయుడు, వర్ధన్, మల్లారపు కృష్ణ, ఎమ్.సోములమ్మ,జి.మంగ, కూటమి నాయకులు తదితరులు పాల్గోన్నారు.

విశాఖలో లులూకు అక్రమ భూకేటాయింపులు రద్దు చేయాలి

భూ కేటాయింపులు పై సిబిఐతో విచారణ జరిపించాలి

విశాలాంధ్ర-విశాఖ సిటీ : రాష్ట్రంలో కూటమి విశాఖ సాగర తీరంలో విదేశీ బహుళజాతి సంస్థ లులూ మాల్ కు కేటాయించిన భూముల ను వెంటనే రద్దు చేయాలని, ఈ అక్రమ కేటాయింపులపై కేంద్ర ప్రభుత్వం వెంటనే సిబిఐతో సమగ్ర దర్యాప్తు జరిపించాలని, ఈ భూములను సైన్స్ పార్క్ గా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం విశాఖ జిల్లా కమిటీ బుధవారం ఈ భూముల్లో నిరసన ప్రదర్శనలు ,ఆందోళన నిర్వహించింది. ఈ సందర్భంగా సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం జగ్గు నాయుడు మాట్లాడుతూ విశాఖ సాగర తీరంలో రాష్ట్ర ప్రభుత్వం లులూకు కేటాయించిన భూములు అత్యంత కీలకమైనవి, విలువైన వన్నారు. ఈ భూములు సి ఆర్ జెడ్ పరిధిలో ఉన్నాయని ప్రతి ఏటా నావికా విన్యాసాలు జరుగుతున్నాయని, వీటిలో స్వదేశీ విదేశీ యుద్ధనౌకలు, విమానాలు పాల్గొంటూ సైనిక సంపత్తిని ప్రదర్శిస్తున్నాయని, ఈ కార్యక్రమంలో భారత రాష్ట్రపతి, ప్రధాని, రక్షణ మంత్రి, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి వంటి ప్రముఖులు పాల్గొంటున్నారని, దేశ రక్షణలో తూర్పు నావికాదళం విశాఖ కేంద్రంగా ఉందని, సముద్ర తీరంలో దేశ రక్షణకు సంబంధించి అనేక కార్యకలాపాలు నిర్వహిస్తోందని ఇంతటి కీలక ప్రాంతంలో ఒక విదేశీ బహుళ జాతి సంస్థను ఎలా అనుమతిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ13.74 ఎకరాల భూములు సుమారు మూడు వేల కోట్ల రూపాయలు విలువ గలవని, వీటిని చదరపు అడుగుకు కేవలం రూపాయి 50 పైసలకు ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు . ఈ భూ కేటాయింపుల్లో వందల కోట్ల రూపాయలు అక్రమాలు జరిగాయని కేంద్ర ప్రభుత్వం ఈ కేటాయింపులపై సిబిఐతో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. జీవీఎంసీ సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి గంగారావు మాట్లాడుతూ లులూ మాల్ కు చంద్రబాబు ప్రభుత్వం భూ కేటాయింపులు పెద్ద గోల్ మాల్ అని, ఈ మాల్ వలన పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు కల్పిస్తారన్నది బూటకమని విమర్శించారు. దీనివలన ఉద్యోగాలు రాకపోగా వేలమంది చిన్న మధ్య తరహా వ్యాపారులు తీవ్రంగా దెబ్బతింటారని, వేల మంది ఉపాధి కోల్పోతారని , ఈ గోల్మాల్ ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు ప్రభుత్వం దీనిని రద్దు చేయకుంటే ,తన పతనం ప్రారంభమవుతుందని హెచ్చరించారు. అభివృద్ధి పేరుతో కొండలను సముద్ర తీర ప్రాంతాల భూములను స్వదేశీ విదేశీ కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టి దేశభద్రతను, పర్యావరణాన్ని ఫణంగా పెట్టడం కూటమి ప్రభుత్వం విడనాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్కే ఎస్ వి కుమార్, పి.మణి, జిల్లా కమిటీ సభ్యులు బొట్టా ఈశ్వరమ్మ, పి పైడిరాజు, ఏ నరేంద్ర కుమార్ ,కే రమాప్రభ, ఎల్ జె నాయుదు, సిపిఎం సీనియర్ నాయకులు ఎస్.జ్యోతీశ్వరావు, జివిఎస్ చలపతి,కె ఎం కుమార మంగళం, పి వెంకటరావు ,ఏ. సత్యారావు,ఏ లోకేష్, ఎం సూరీడు, మహిళా నాయకులు కె.కుమారి, డి.కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ మహమ్మారిని అరికట్టేందుకు మోదీ సర్కార్ విప్లవాత్మక చర్యలు

బిజెపి బీసీ నేత మూల వెంకటరావు

విశాలాంధ్ర-పెందుర్తి : దేశంలో క్యాన్సర్ మహమ్మారిని అరికట్టేందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం విప్లవాత్మక చర్యలకు శ్రీకారం చుట్టిందని భారతీయ జనతా పార్టీ బీసీ నేత, వికసత్ భారత్ 2047 విశాఖ జిల్లా కో కన్వీనర్ మూల వెంకట్రావు తెలిపారు. దేశవ్యాప్తంగా 200కు పైగా క్యాన్సర్ డే కేర్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు కేంద్రమంత్రి పార్లమెంటులో ప్రకటించారని, అందులో ఏపీకి 14సెంటర్లు కేటాయించడం హర్షదాయకమని పేర్కొన్నారు. క్రిష్ణా, బి. ఆర్. అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, అల్లూరి సీతారామరాజు, నంద్యాల, విజయనగరం, అన్నమయ్య, పల్నాడు, కాకినాడ, బాపట్ల, ఎన్టీఆర్ జిల్లాల్లో క్యాన్సర్ డి కేర్ సెంటర్ల ఏర్పాటు చేయడం ఆనందదాయకమని, అయితే మిగిలిన అన్ని జిల్లాల్లోనూ ఈ సెంటర్లు ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆరోగ్య శాఖామంత్రి సత్య కుమార్ యాదవ్ కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రధానమంత్రి ఆయుష్ మాన్ భారత్ : ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన కింద క్యాన్సర్ మహమ్మరి నుంచి రోగులను రక్షించేందుకు, విస్తృత సేవలు అందించడానికి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం సిద్ధపడడం కోట్లాదిమంది క్యాన్సర్ బాధితులకు వరం లాంటిదని మూల వెంకటరావు అభిప్రాయపడ్డారు. అందరికీ ఆరోగ్యం అనేది మోదీ సంకల్పమని ఆదిశగా అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ కేర్ సెంటర్లలో మహిళలకు క్యాన్సర్ పరీక్షలు విరివిగా నిర్వహించి, వారు గర్భ క్యాన్సర్ బారిన పడకుండా చర్యలు చేపడుతారని చెప్పారు. రాష్ట్రంలో ఏడాదికి క్యాన్సర్ కారణంగా 30 వేల మందికి పైగా చనిపోతున్నారని వెంకటరావు ఆవేదన వ్యక్తం చేశారు. మోది ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న క్యాన్సర్ డే కేర్ సెంటర్ల ద్వారా బాధితులకు డబ్బు, సమయం ఆదా అవుతుందని, ముఖ్యంగా పేద మధ్యతరగతి ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. క్యాన్సర్ బాధితులు దూర ప్రాంతాలకు వెళ్ళి చికిత్స చేసుకోవడవలన ఆర్థికంగా చాలా నష్టపోతున్నారని, అలాంటివారికి మోడీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న క్యాన్సర్ డే కేర్ సెంటర్లు లాభదాయకంగా ఉంటాయన్నారు. తొలి దశలోనే ఏపీకి 14 సెంటర్లు మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేసిన మూల వెంకటరావు మిగిలిన జిల్లాలకు కూడా తొందరగా క్యాన్సర్ డే కేర్ సెంటర్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏపీ పట్ల ప్రధాని నరేంద్ర మోడీకి గల అభిమానానికి ఇది నిదర్శనమని అభిప్రాయపడ్డారు. రాష్ట్రానికి 14 క్యాన్సర్ డే కేర్ సెంటర్లు సాధించిన ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ కు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

శ్రీవెంకటేశ్వర విద్యాపీఠ్‌లో ఏయూ దూరవిద్యా కోర్సులు

విశాలాంధ్ర-కొమ్మది : మధురవాడ, భీమిలీ పరిసర ప్రజలలో అక్షరాస్యత పెంపొందించే ఉద్దేశంతో గత సంవత్సరం నుండి ఆంధ్రా యూనివర్సిటీ అనుమతితో చదువులో ఆసక్తి గల గృహిణిలు,మధ్యలో చదువు ఆపేసిన వారు... తిరిగి చదువు కొనసాగించేందుకు దూర విధ్యా కోర్సులు అన్నింటిని అతి తక్కువ ఫీజులతో కరస్పాండెన్స్,రెగ్యులర్ ద్వారా ఎస్ఎస్సీ, బిఈడీ, డిఈడీ కోర్సులు శ్రీవెంకటేశ్వర విద్యాపీఠ్, నగరపాలెం రోడ్డు, మధురవాడలో అందుబాటు లో ఉంటాయని చైర్మన్ వై.వెంకటేశ్వర్లు అన్నారు. గ్రేటర్ విశాఖ మధురవాడ శివశక్తినగర్ రోడ్డు లోగల ప్రెస్ క్లబ్ లో అయన మీడియాతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. 14 సంవత్సరాలు దాటిన పిల్లలకు, చదవగలిగే ఉత్సాహం ఉన్న వారందరికీ ఏపిఓఎస్ఎస్ ద్వారా ఎస్ఎస్సి, ఇంటర్ పరీక్షకు పంపిస్తున్నామన్నారు. అలాగే 15 సంవత్సరాలు దాటిన వారందరికీ, టెన్త్ పాస్ అయిన విద్యార్థులకు రెండు సంవత్సరాలు చదివే ఇంటర్మీడియట్ కోర్సును ఒక్క సంవత్సరంలో వన్ సిట్టింగ్ ద్వారా పూర్తి చేసుకునే విధానాన్ని కూడ ముందుకు తీసుకు వచ్చాము అని తెలిపారు. ఉద్యోగస్తులకు దూరవిద్య ద్వారా యూజీ, పీజీ కోర్సులను అందిస్తున్నామని, ప్రధానంగా మీడియా కొరకు మాస్ కమ్యూనికేషన్, జర్నలిజం కోర్స్ కూడా అందులో ఉందని పేర్కొన్నారు. టీచర్స్ శిక్షణ కోర్సులు, బీఈడీ, డిఈడి ఇంగ్లీష్ మీడియం కోర్సులను ప్రవేశపెట్టి ఎంతో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో శిక్షణను ఇప్పిస్తున్నామన్నారు. సమాజంలో ఒక కొత్త యుగాన్ని, ఒక నవశకాన్ని తయారుచేసి అధ్యాపకులను రేపటి తరానికి అందించాలనేది మా సంస్థ యొక్క ముఖ్య ఉద్దేశమని అన్నారు. రాబోయే సెప్టెంబర్ 5న కూటమి ప్రభుత్వం వెలువరించే మెగా డీఎస్సీలో ఫలితాలలో అల్లూరి జిల్లా, విజయనగరం, విశాఖలో అత్యధిక ఉపాధ్యాయ పోస్టులను అందుకునే ఏకైక విద్యాసంస్థగా నిల్బంటుందని ఆశాభావం వ్యక్తం చేసారు.ఈ అవకాశం సద్వినియోగం చేసుకునేందుకు ఎక్కువమంది ఔత్సాహికులకు ఈప్రకటన చేరేలా కృషి చేయాలని మీడియాని కోరారు. మరిన్ని వివరాలకు చరవాణి సంఖ్య 7386000590ను సంప్రదించాలని కోరారు. అనంతరం, సంస్థ ఆఫర్ చేయబోవు దూర విద్యా కోర్సులు గోడ పత్రిక విడుదల చేసారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కెవిఎస్ శ్రీనివాసరావు, పి.తిరుపతిరావు, స్కూల్ ఇన్చార్జ్ ఏ స్వాతి, దూరవిద్య ఇంచార్జ్ ఆర్ పద్మప్రియ తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ వాహనాలకు జిపిఎస్ వ్యవస్థను పటిష్ట పరచండి

జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : జీవీఎంసీ వాహనాలకు జిపిఎస్ వ్యవస్థను పటిష్ట పరిచాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లలో జీవీఎంసీ మెకానికల్ పర్యవేక్షక ఇంజనీరు జి గోవిందరావు, కార్యనిర్వాహక ఇంజనీరు ఎ. రత్నాకర్ రెడ్డి, మెకానికల్ అడ్వైజర్ ఎం. కె . సాయిబాబు, ఫాస్ట్ ఫార్వర్డ్ టెక్నికల్ టీం వి. సుధీర్, ఎంట్రో ల్యాబ్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎం. సురేంద్రలతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ జీవీఎంసీ సొంత వాహనాలు, అద్దె వాహనాలు వివరాలను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత సమయంలో వాహనాలు విధుల్లో ఉండాలని, విధుల్లో ఉన్న వాహనాలు నిలిపివేయడం గాని, దారి మళ్లించడం గాని చేయరాదన్నారు. అధికారులకు కేటాయించిన వాహనాల వివరాలు డిజిటల్ విధంగా చూపించాలని, ఎలాంటి హోదా కలిగిన అధికారులు వాహనాలను వినియోగిస్తున్నారో ట్రాక్ చేయాలని ఆదేశించారు. జీవీఎంసీ వాహనాలకు జిపిఎస్ వ్యవస్థను పటిష్ట పరచడం వలన వాహనాల పనితీరును గమనించవచ్చన్నారు. వాహన డ్రైవర్ల లాగ్ బుక్కు, మెయింటెనెన్స్ , మరమ్మత్తులు, మైలేజీ లను ఎప్పటికప్పుడు డిజిటల్ రూపంలో పొందుపరచాలని ఆదేశించారు. జిపిఎస్ సిస్టంతో ఎప్పటికప్పుడు పరిశీలించాలని తద్వారా ఇంధనం వినియోగం,ప్రయాణ మార్గాలను విశ్లేషించి నిబంధన ప్రకారం నిర్దేశించిన ఆయా మార్గంలో వెళ్తున్నారా లేదా అని పర్యవేక్షించాలన్నారు. పారిశుధ్యం నిర్వహించే వాహనాలకు ప్రత్యేకించి రూట్ మ్యాప్ ను రూపొందించి, వాహనాలు తిరిగే మార్గాలను సక్రమంగా వెళ్తున్నాయా లేదా వ్యక్తిగత ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నారా అని పరిశీలించాలన్నారు. వాహనాలు మరమ్మత్తులు వెంట వెంటనే చేపట్టి వాటిని వినియోగంలోకి తీసుకొని రావాలని ఆదేశించారు. హెచ్ పి సి ఎల్ నుండి ఇంధనం వినియోగాన్ని డిజిటలైజ్ చేసి దానిపై పర్యవేక్షణ చేయాలన్నారు. వాహనాల జిపిఎస్ ట్రాకింగ్ సిస్టంలో సాంకేతిక లోపాలను పరిష్కరించడానికి ఎగ్జిక్యూటివ్ అథారిటీతో ఎప్పటికప్పుడు చర్చల ఆధారంగా వాహనాల జిపిఎస్ లోపాలను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని పర్యవేక్షక ఇంజనీరు గోవిందరావును కమిషనర్ ఆదేశించారు.

జాతీయ పౌర హక్కులపై అవగాహన

విశాలాంధ్ర-పద్మనాభం : ప్రతి మనిషి తనకున్న ప్రతి హక్కును సద్వినియోగపరుచుకోవాలని, సమాజంలో ఆదర్శవంతమైన జీవితాన్ని గడపాలని ముఖ్యంగా చదువుకొని ఎవరు ఖాళీగా ఉండవద్దని యువకులకు పద్మనాభం మండల తహసిల్దార్ కాకర ఆనందరావు సలహా ఇచ్చారు.జాతీయ పౌర హక్కుల దినోత్సవం పురస్కరించుకుని మండలంలోని రెడ్డిపల్లి మేజర్ పంచాయతీ ఎస్సీ కాలనీలో అవగాహన సదస్సు నిర్వహించారు.దళితులమనే చిన్న చూపుతో బ్రతకవద్దని,ప్రతి ఒక్కరూ చదువుకోవాలని,చదువుకుని ఖాళీగా ఉండవద్దని రాజ్యాంగంలో అగ్రవర్ణాలతో పాటు,ముఖ్యంగా దళితులకు ఎన్నో పౌర హక్కులు కల్పించబడ్డాయని ప్రతి ఒక్కరూ వాటిని సద్వినియోగం చేసుకోవాలని తహసిల్దార్ కోరారు.చదువుకున్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగమే రావాలని కోరిక విడిచిపెట్టాలని,కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని,వాటికి దరఖాస్తు చేసుకొని ఉపాధి పొందవచ్చునని ,ఇది కూడా పౌర హక్కులలో ఒక భాగమేనని ఆనందరావు పేర్కొన్నారు.పౌరహక్కులలో భాగంగా ప్రతి ప్రభుత్వ విభాగంలో గానీ,ప్రైవేటు సంస్థలలో గాని సంబంధిత అధికారులను,మేనేజ్మెంట్ లను కలిసి నిరుద్యోగులకు కావలసిన ఉపాధి హక్కులు పొందవచ్చని తాసిల్దార్ సూచించారు.ఈ అవగాహన సదస్సులో స్థానిక న్యాయవాది ఈర్లే ఈశ్వరరావు,రెడ్డిపల్లి విఆర్ఓ,దళితులు,ఇతరులు పాల్గొన్నారు.

ఏపీలో టాటా ఏఐఏ క్వాలిఫైడ్ ఏజెంట్లు నమోదు

విశాలాంధ్ర-విశాఖపట్నం : టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ కో లిమిటెడ్ 2025 గ్లోబల్ ఎండీఆర్టీ ర్యాంకింగ్ ప్రకారం ఎండీఆర్ టీ టైటిల్ కోసం సంస్థ విశాఖపట్నం నుండి 8 మంది సలహాదారులను నమోదు చేసింది. 2025 కోసం ఇటీవల విడుదలైన గ్లోబల్ ఎండీఆర్టీ ర్యాంకింగ్ ప్రకారం, టాటా ఏఐఏ మరోసారి వరుసగా మూడవ సంవత్సరం భారతదేశంలో అత్యధిక సంఖ్యలో ఎండీఆర్టీ అర్హత కలిగిన సలహాదారులను పొందింది. అదే సమయంలో గ్లోబల్ ర్యాంకింగ్‌ను సాధించింది. రికార్డు స్థాయిలో 2,871 ఎండీఆర్టీ క్వాలిఫైయర్లతో, ఈ మైలురాయి మునుపటి సంవత్సరంతో పోలిస్తే 11 శాతం వృద్ధిని ప్రతిబింబిస్తుందని ఆ సంస్థ ప్రతినిధి వెల్లడించారు. ఇది టాటా ఏఐఏ సలహాదారుల యొక్క పెరుగుతున్న క్యాలిబర్ మరియు అచంచలమైన అంకితభావాన్ని ప్రదర్శిస్తుందన్నారు. టాటా ఏఐఏ ను నిజంగా వేరుగా ఉంచేది వైవిధ్యం మరియు చేరికకు దాని లోతైన నిబద్ధత అన్నారు. ఆల్-టైమ్ గరిష్ట 1,343 మంది మహిళా ఎండీఆర్టీ సభ్యులతో, టాటా ఏఐఏ మహిళా సభ్యత్వం ద్వారా టాప్ 25 కంపెనీలలో ప్రపంచవ్యాప్తంగా 7 స్థానాన్ని దక్కించుకుందని చెప్పారు. గర్భాశయం లోపలి పొర (ఎండోమెట్రియల్), అండాశయ(ఒవేరియన్) క్యాన్సర్ల కోసం సమగ్రమైన ముందస్తు గుర్తింపు

'ఎండ్-ఓ చెక్'ను ప్రారంభించిన అపోలో క్యాన్సర్ సెంటర్స్



విశాలాంధ్ర-విశాఖపట్నం : మహిళల ఆరోగ్యం మరీ ముఖ్యంగా క్యాన్సర్ నివారణ పట్ల తమ నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ, అపోలో క్యాన్సర్ సెంటర్స్ (ఏసీసీ) ఈరోజు 45 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న మహిళలను లక్ష్యంగా చేసుకుని సమగ్రమైన ముందస్తు క్యాన్సర్ గుర్తింపు కార్యక్రమం ఎండ్ ఓ చెక్‌ను ప్రారంభించింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో అపోలో క్యాన్సర్ సెంటర్స్ సీనియర్ కన్సల్టెంట్ సర్జికల్ ఆంకాలజీ & చీఫ్ రోబోటిక్ సర్జన్ డాక్టర్ ఎంపిఎస్ చంద్ర కళ్యాణ్, సీనియర్ కన్సల్టెంట్ ప్రసూతి & స్త్రీ జననేంద్రియ నిపుణులు డాక్టర్ సౌధామిని బచ్చు, డాక్టర్ శ్రీదేవి మట్ట, డాక్టర్ విద్యా కొండూరి మాట్లాడుతూ ఈ కార్యక్రమం అత్యంత ప్రబలంగా ఉన్న రెండు స్త్రీ జననేంద్రియ క్యాన్సర్‌లు అయినటువంటి గర్భాశయం లోపలి పొర (ఎండోమెట్రియల్) మరియు అండాశయ (ఒవేరియన్) క్యాన్సర్ లను తొలిదశ మరియు మరింత మెరుగైన చికిత్స చేయగల దశలో గుర్తించడం లక్ష్యంగా రూపొందించబడిందన్నారు. ఎండోమెట్రియల్ క్యాన్సర్ అనేది గర్భాశయం యొక్క లోపలి పొరలో ప్రారంభమవుతుందన్నారు. అండాలు మరియు స్త్రీ హార్మోన్లను ఉత్పత్తి చేసే అవయవాలలో అండాశయ క్యాన్సర్ ప్రారంభమవుతుందన్నారు. ఈ రెండు క్యాన్సర్లలోనూ లక్షణాలు సాధారణంగా ఒకే తీరులో ఉంటాయని, కడుపు ఉబ్బరం లేదా వాపు, పొత్తికడుపు లేదా కడుపులో నొప్పి, త్వరగా కడుపు నిండినట్లు అనిపించడం లేదా తినడానికి ఇబ్బంది పడటం, తరచుగా లేదా అత్యవసరంగా మూత్రవిసర్జన చేయాల్సి రావటం, మలబద్ధకం, వివరించలేని కారణాలతో బరువు తగ్గడం, అలసట, వెన్నునొప్పి మరియు జననేంద్రియాలు నుంచి రక్తస్రావం వంటి లక్షణాలు కనిపిస్తాయని చెప్పారు. మరీ ముఖ్యంగా మెనోపాజ్ అనంతర కాలంలో ఈ సమస్య ఎక్కువగా కనిపించే అవకాశాలు ఉన్నాయని, ఈ లక్షణాలు మెరుగైన చికిత్స కోసం ఈ క్యాన్సర్‌లను ముందుగానే గుర్తించడంలో సహాయపడతాయని, దురదృష్టవశాత్తు చాలా మంది మహిళలు ఈ సంకేతాలను ముందుగానే నివేదించడంలో విఫలమవుతారని, దీని వలన రోగ నిర్ధారణ ఆలస్యం అవుతుంది. ఫలితాలు కూడా ఆశాజనకంగా ఉండవు అని చెప్పారు. ముందస్తుగా సమస్యను గుర్తించటం, లక్షణాలపై అవగాహన, సకాలంలో జోక్యం చేసుకోవడం, మహిళలు తమ స్త్రీ జననేంద్రియ ఆరోగ్యం కోసం ముందస్తు చర్యలు తీసుకునేలా అవగాహన కల్పించడంపై దృష్టి సారించి ఎండ్ ఓ చెక్ రూపొందించబడిందన్నారు.

విద్యార్థి దశ నుండే సమాజంపై అవగాహన కలిగి ఉండాలి

జిల్లా కోర్టు జడ్జి పి.స్వాతి భవాని

విశాలాంధ్ర-పీఎం పాలెం : విద్యార్థి దశ నుండే సమాజంపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని 16వ ఏ.ఎం.ఎం జిల్లాకోర్టు మేజిస్ట్రేట్ పి.స్వాతి భవాని అన్నారు. మధురవాడ చంద్రంపాలెం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మానవ అక్రమ రవాణా, పిల్లలపై సోషల్ మీడియా ప్రభావంపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు చేస్తూ ఆమె మాట్లాడారు. చిన్న వయసులోనే సోషల్ మీడియాకు అలవాటు పడటం వల్ల తీవ్రమైన ప్రతికూల ప్రభావాలు ఉంటాయన్నారు. యుక్త వయస్సులో ఏది మంచి,ఏది చెడు అని అర్థం చేసుకునే పరిణతి ఉండదని హానికరమైన కంటెంట్ నుండి తమను తాము రక్షించుకునే పరిజ్ఞానం కూడా వారికి ఉండదు.ఇలాంటి పరిస్థితుల్లో పిల్లలు మానసిక ఆరోగ్య సమస్యలకు, అనారోగ్యకరమైన శరీర సౌందర్య భావనలకు సులభంగా లోనవుతారని గుర్తు చేసారు.తల్లిదండ్రులు, సంరక్షకులు పిల్లలకు సోషల్ మీడియా వాడకంపై అవగాహన కల్పించాలని తెలియని వ్యక్తులతో పరిచయాలు పెట్టుకోవద్దని, అదేవిధంగా పిల్లలకు సోషల్ మీడియా వినియోగంపై పరిమితులు విధించడంతోపాటుగా తల్లిదండ్రులు పిల్లలతో సంభాషించి,వారి సమస్యలను అర్థం చేసుకోవాలని పిల్లలు సోషల్ మీడియాలో ఏమి చూస్తున్నారో,ఏమి చేస్తున్నారో గమనిస్తూ నిరంతరం వారిని పరిశీలిస్తూ వుండాలని కోరారు. కార్యక్రమంలో ఈ అవగాహన సదస్సులో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.జనార్ధన్ రావు, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఎన్.సూరిబాబు, అడ్వకేట్ మాధవి,పాఠశాల ఉపాధ్యాయులు మరియు పి.ఎం.పాలెమ్ పిఎస్ సీ.ఐ.జి బాలకృష్ణ, ఎస్ ఐ సునీత, వారి సిబ్బంది పాల్గొన్నారు.

యోగాసనాల్లో సత్తా చాటిన శ్రీ చైతన్య విద్యార్థులు

విశాలాంధ్ర-పెందుర్తి : 13వ దక్షిణ ఇండియా యోగాసన ఛాంపియన్ షిప్ 2025 పోటీలలో పెందుర్తి శ్రీ చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. పద్మ యోగ, న్యాచురల్ లివింగ్ డెవలప్మెంట్ ట్రస్టు వారిచే తమిళనాడు స్పోర్ట్స్ యోగాసన అసోసియేషన్ ఆధ్వర్యంలో 5 రాష్ట్రాల విద్యార్థులకు నిర్వహించిన పోటీలలో చైతన్య పాఠశాల పెందుర్తి శాఖ విద్యార్థిని, విద్యార్థులు ఘనవిజయం సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.తారకేశ్వరరావు తెలిపారు. ప్రథమ బహుమతి ఎం, భువనతేజ్, (8వ తరగతి), రెండో బహుమతి పి. కేశవసూర్య (ఏడవ తరగతి), స్పెషల్ ఈవెంట్ ఎం మోక్షిత్ (9వ తరగతి), స్పెషల్ ఈవెంట్స్ లో కె ఆరాధ్య (8వ తరగతి), ఎస్. ఆరాధ్య (8వ తరగతి) మెమెంటోలు అందుకున్నారని ఆయన చెప్పారు. ప్రథమ బహుమతి పొందిన ఎం. భువన్ తేజ్ 10 -22 సంవత్సరాల బాలుర పోటీలో ఛాంపియన్ షిప్ సాధించారని, యోగా శిక్షకురాలు ఎం. దుర్గా మాధవికి ఐదు రాష్ట్రాల్లో ద్వితీయ బహుమతి లభించిందని తెలియజేశారు. చైతన్య పాఠశాల విద్యార్థుల విజయానికి యోగా శిక్షకురాలు శిక్షణ కారణమని తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు విద్యతోపాటు సహపాఠ్య కార్యక్రమాల్లో కూడా విజయం సాధించడం చాలా సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. శ్రీ చైతన్య యాజమాన్యం విద్యార్థులకు అని రంగాల్లో శిక్షణ ఇస్తుందని తెలియజేశారు. యోగాసనల్లో విజయం సాధించిన విద్యార్థులకు ఉత్తరాంధ్ర పాఠశాలల ఏ జిఎంఎంవి సురేష్, రీజినల్ ఇంచార్జ్ ఆ హమ్మద్ అలీ అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డీన్ ఎం ఆర్ వి శేషగిరి, సి బ్యాచ్ ఇంచార్జ్ హఫసా, ఐకాన్ ఇంచార్జ్ టి లక్షణ మూర్తి, యోగ ఉపాధ్యాయిని ఎం. దుర్గా మాధవి మరియు ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

గంగంపేట స్మశానవాటికను బాగు చేయండి

విశాలాంధ్ర-పెందుర్తి : మండలంలోని గొరపల్లి పంచాయతీ గంగంపేట స్మశాన వాటికను బాగు చేసి, కనీస సదుపాయాలు కల్పించాలని పెందుర్తి నియోజకవర్గం బహుజన సమాజ్ పార్టీ నాయకుడు కాకర ప్రేమ్ కుమార్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. గంగంపేట స్మశాన వాటికలో పిచ్చి మొక్కలు పెరిగిపోయి, గ్రామంలో ఎవరు చనిపోయినా శవాన్ని దహనం చేయడానికి ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారన్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి స్మశాన వాటికను అభివృద్ధి చేసి మౌలిక వసతులు కల్పించాలని కోరారు.

భూగర్భ విద్యుత్ కేబుల్ పనులు ప్రారంభం

విశాలాంధ్ర-మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధి 58 వార్డ్ శ్రీహరిపురం, సబ్ స్టేషన్ లో విదేశీ తరహాలో విశాఖ నగరంలో కూడా భూగర్భ విద్యుత్ కేబుల్ పనులను బుధవారం ప్రభుత్వ విప్ గణబాబు పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.